



వై ‘చీప్ ట్రిక్స్’!



అరాచకాలకు, వివాదాలకు కేంద్రబిందువుగా వైసీపీ నాయకులు

చిత్తూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):అరాచకాలకు, వివాదాలకు వైసీపీ నాయకులు కేంద్ర బిందువుగా మారుతున్నారు. తాము రాజకీయంగా ఎదిగేందుకు, పార్టీని బలోపేతం చేసుకునేందుకు ప్రజల్లో తిరిగి పని చేయడం మానేసి టీడీపీ మీద, ప్రభుత్వం మీద బురద జల్లే పనుల్నే లక్ష్యం చేసుకున్నారు.పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జుల నుంచి కింది స్థాయి నాయకుల వరకు అందరూ ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారు. జిల్లాలో వరుసగా జరుగుతున్న సంఘటనలే దీనికి నిదర్శనం.

● అంబేద్కర్ ఘటనతో అభాసుపాలు



వెదురుకుప్పం మండలం దేవళంపేటలో వైసీపీ సర్పంచి గోవిందయ్య అంబేడ్కర్ విగ్రహానికి మంట తగిలేందుకు కారణమయ్యారు. ముందస్తు ప్రణాళిక మేరకు స్థానిక టీడీపీ నేతలు సతీష్‌నాయుడు తదితరుల మీద నెపం నెట్టే ప్రయత్నం చేశారు. దర్యాప్తుతో కుట్రను ఛేదించిన పోలీసులు ఈ ఘటనకు కారకుడు గోవిందయ్యను అరెస్టు చేసి కటకటాల వెనక్కి నెట్టారు.అంతకుముందు మాజీ మంత్రి నారాయణస్వామి, జిల్లా వైసీపీ నాయకుల్ని దేవళంపేటకు పిలిపించి మరీ ధర్నా చేయించారు. టీడీపీని ఇబ్బంది పెట్టాలనే వారి కుట్ర చివరకు బెడిసికొట్టింది. టీడీపీ ఎమ్మెల్యేలు థామస్, మురళీమోహన్ ఘటన జరిగిన రోజు రాత్రి పాత విగ్రహం స్థానే నూతన విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. చివరకు పోలీసుల దర్యాప్తుతో వైసీపీ, నారాయణస్వామి అభాసుపాలయ్యారు.

● గ్యాంగ్ రేప్‌ను టీడీపీ మీద నెట్టే యత్నం

జిల్లా కేంద్రమైన చిత్తూరులో ఇటీవల ఓ బాలికను పార్కులో ముగ్గురు యువకులు బెదిరించి గ్యాంగ్ రేప్ చేశారు. వారిలో ఒకడు వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డికి ప్రధాన అనుచరుడు. అతనితో కలిసి ఆ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. కానీ వైసీపీ దీన్ని అవకాశంగా మార్చుకుంది. ఆ నిందితుడు వినాయక చవితి రోజున ఎమ్మెల్యే గురజాలను కలిసిన ఫొటోను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసింది. ఓ దశలో ముగ్గురూ టీడీపీ కార్యకర్తలేనని చిత్రీకరించింది. ఎమ్మెల్యే గురజాల వెంటనే స్పందించి ఆ నిందితుడు వైసీపీలో పనిచేసిన వాడేనని రుజువులు చూపారు. అలాగే, ఆ ముగ్గురికీ కఠిన శిక్ష పడేలా చేయాలని పోలీసు అధికారులను కోరారు.

● పోలీసులతో దురుసు ప్రవర్తన



పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ స్థానిక ఎస్‌ఐ లోకేశ్‌రెడ్డి పట్ల అత్యంత దురుసుగా ప్రవర్తించిన ఘటన తాజాగా తీవ్ర కలకలం రేపింది. పట్టణంలోని ఓ భవన నిర్మాణం అక్రమమంటూ మంగళవారం వెంకటేగౌడ తన అనుచరులతో కలిసి అడ్డుకున్నారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. దీంతో ఎస్‌ఐ లోకేశ్‌పై మాజీ ఎమ్మెల్యే తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. మాటలతో ఆగకుండా ఆయనపైకి దూసుకెళ్లి దాడి చేసేందుకు ప్రయత్నించారు. ఓ దశలో ఎస్‌ఐని ‘ఎవడ్రా నువ్వు’అని కూడా అన్నారు.

● ఎమ్మెల్సీ పీఏ వార్నింగులు

ఎమ్మెల్సీ భరత్ పీఏ మురుగేశ్ రామకుప్పం మండలం పెద్దగానూరుకు చెందిన ప్రకాశ్‌రెడ్డి అనే వ్యక్తిని ఫోనులో కులం పేరుతో దూషించారు. బెదిరింపులకు పాల్పడ్డారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాలతో ఈ నెల 4న మురుగేశ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రకాశ్‌రెడ్డి కుమారుడు దళిత అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకోవడం ఈ ఫోన్ కాల్‌కు కారణమైంది.

నేటినుంచి విధుల్లోకి పీహెచ్‌సీ వైద్యులు



డీఎంహెచ్‌వో సుధారాణికి సమ్మె విరమణ పత్రాన్ని అందజేస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 24 రోజులుగా విధులకు హాజరుకాకుండా సమ్మె చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు విషయం శుక్రవారం సమ్మె విరమించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌తో పీహెచ్‌సీ వైద్యుల సంఘం జరిపిన చర్చలు సఫలమవడంతో సమ్మె విరమణ నోటీసును కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు, డీఎంహెచ్‌వో సుధారాణికి అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ తమ డిమాండ్లను నెరవేరుస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించామన్నారు. విజయవాడలో జరిగిన సమ్మెలో పాల్గొన్న వైద్యులు రావడానికి సమయం పడుతుండడంతో ఆదివారం నుంచి విధుల్లో చేరుతామని పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు.

గల్లంతైన బాలుర మృతదేహాలు లభ్యం
మిన్నంటిన కుటుంబీకుల రోదనలు
7లో

అర్ధగిరి వద్ద చిరుత సంచారం

తవణంపల్లె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):తవణంపల్లె మండలంలోని అరగొండ సమీపంలో వున్న అర్ధగిరి వద్ద మూడు మేకలను చిరుత ఎత్తుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. కొండ్రాజుకాల్వ పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన అబ్బాస్ బుధవారం మేకలను మేత కోసం అర్ధగిరి కొండకు తోలుకెళ్లాడు.సిద్ధార్థ జ్యూస్ ఫ్యాక్టరీ వెనుక వైపు అర్ధగిరి కొండలో మేకలు మేస్తుండగా చిరుత దాడి చేసి రెండు మేకలను ఎత్తుకెళ్లినట్లు అబ్బాస్ తెలిపాడు. గురువారం మరో మేకను తన కళ్లెదుటే ఎత్తుకెళ్లినట్లు తెలిపాడు.అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో గాజులపల్లె ఎఫ్‌బీవో జబి సంఘటనా స్థలానికి చేరుకొని చిరుత కాలి ముద్రలను సేకరించారు.ఈ సంఘటన గురించి ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు ఆయన తెలిపారు.

ట్రావెల్స్ బస్సులపై 22 కేసులు

● డీటీసీ నిరంజన్ రెడ్డి



బస్సు వద్ద డీటీసీ నిరంజన్ రెడ్డి, ఎంవీఐలు

చిత్తూరు సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ప్రైవేటు బస్సు ప్రమాదం జరిగి 20మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా రవాణా శాఖ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. శుక్రవారం రాత్రి వివిధ ప్రాంతాల నుంచి చిత్తూరు జిల్లా మీదుగా వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని 22 బస్సులపై కేసులు నమోదుచేసినట్లు జిల్లా రవాణాశాఖ అధికారి నిరంజన్‌రెడ్డి వివరించారు.చిత్తూరు శివార్లలోని ఇరువారం జంక్షన్ మీదుగా బెంగళూరు, చెన్నై, తిరుపతి, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లే బస్సులను తనిఖీ చేశామన్నారు. అగ్నిమాపక పరికరాలు లేని 17, ప్యాసింజర్స్ లిస్ట్ లేనివి 3, పత్రాలు సరిగా లేనివి, ఎమర్జెన్సీ డోర్‌లు లేనివి, డ్రైవింగ్ లైసెన్సు లేనివి, అనుమతి లేకుండా బస్సులో మార్పులు చేసినవి... ఇలా మొత్తం 22 కేసులు నమోదు చేశారు. శనివారం కూడా తనిఖీలు కొనసాగించామన్నారు.నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.యాజమాన్యాలు ఆదాయంతో పాటు ప్రయాణికుల భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ఆరంజ్ అలర్ట్..!

మూడు రోజుల పాటు భారీ వర్ష సూచన

● యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన కలెక్టర్



పలమనేరులో శనివారం సాయంత్రం కురిసిన వర్షంతో రోడ్లపై నిలిచిన నీరు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):మొంథా తుపాను ప్రభావంతో వచ్చే మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున జిల్లాను ఆరెంజ్ అలెర్ట్ జోన్‌గా ప్రకటించినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. శనివారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుంచి ఎస్పీ తుషార్ డూడీతో కలిసి ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.అన్ని శాఖల ఉద్యోగులు అందుబాటులో ఉండేవిధంగా చూడాలని ఆదేశించారు.వాగులు, వంకల ప్రవాహ తీవ్రతను ముందుగానే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. కోతకు వచ్చిన పంటలను కోయకుండా వాయిదా వేసుకునేలా, పండించిన ధాన్యాన్ని భద్రపరిచే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. 80 శాతం నిండిన చెరువులను గుర్తించడంతో పాటు రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిత్యం పర్యవేక్షించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.కుంటలు, వాగులు, వంకల్లో ఈతకు వెళ్లకుండా పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో విద్యుత్‌కు అంతరాయం రాకుండా చూసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట్ల జనరేటర్లు అందుబాటులో ఉంచాలన్నారు. చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో తేనెబండ వద్ద నీవా నది ఉధృతంగా ప్రవహిస్తున్న కారణంగా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. టెలికాన్ఫరెన్స్‌లో డీఆర్వో మోహన్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

8 మండలాల్లో వర్షం

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు వర్షం కురిసింది. రొంపిచెర్లలో 13.6 మి.మీ వర్షం నమోదు కాగా, సదుంలో 2.8, పులిచెర్లలో 10.2, నింద్రలో 8.6, నగరిలో 2, కార్వేటినగరంలో 12.4,వెదురుకుప్పం, విజయపురం మండలాల్లో ఒక్క మి.మీ వర్షపాతం నమోదైంది.

వరద సాయం విడుదల

● అత్యవసర సహాయక పనులకు రూ.2 కోట్ల కేటాయింపు

చిత్తూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో అత్యవసర సహాయక చర్యలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రాష్ట్రంలోని వరద ప్రభావిత 10 జిల్లాలకు రూ.14 కోట్ల మేర నిధుల్ని విడుదల చేయగా, చిత్తూరు,తిరుపతి జిల్లాలకు రూ.2 కోట్ల చొప్పున కేటాయించింది.ఈ నిధుల్ని వరద ప్రాంతాల నుంచి ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు, ఆహారంతో పాటు మంచి నీళ్లు అందించేందుకు, మెడికల్ క్యాంపుల్ని ఏర్పాటు చేసేందుకు, రోడ్లతో పాటు అవసరమైన వసతుల్ని పునరుద్ధరించేందుకు ఉపయోగించనున్నారు. బాధితుల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైతే ఆర్టీసీ బస్సుల్ని అద్దెకు తీసుకోవాలని, నిరాశ్రయ కేంద్రాలు సరిపోకుంటే ప్రభుత్వ విద్యాసంస్థల్ని వాడుకోవాలని, రోడ్లపై పడిపోయిన చెట్లను తొలగించేందుకు సంబంధిత శాఖల సహకారం తీసుకోవాలని తెలిపారు. అలాగే, ఈ నిధుల్ని డ్రా చేసుకున్న 30 రోజుల్లోనే వినియోగించుకోవాలని, మిగిలిపోతే ప్రభుత్వ ఖజానాకు తిరిగి చెల్లించాలని ప్రభుత్వం సూచించింది.

పెద్దశేష వాహనంపై మలయప్ప దర్శనం



నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమలలో శనివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి పెద్ద శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామి, అమ్మవార్లు తిరుమాడవీధుల్లో ఊరేగారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, గోవిందనామస్మరణలు, కర్పూర హారతుల నడుమ పెద్దశేష వాహనం వైభవంగా జరిగింది. రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కాలం చెల్లేలోపు వాడుకోలేక నేలపాల్జేశారు



పలమనేరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి ప్రభుత్వం సరఫరా చేసిన విలువైన మందులు, మాత్రలు, వ్యాక్సిన్లు, బ్లడ్ యూనిట్లు సకాలంలో వాడుకోలేక వృధాగా నేలపాల్జేశారు. వాస్తవానికి ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులు, వారికి కావలసిన మందులపై ఒక అంచనాతో వీటిని ఇండెంట్ పెట్టి తెప్పించాల్సి వుంటుంది. అయితే ఇలా ఎందుకు తెప్పించి వృధా చేశారో అర్థం కావడం లేదు.జిల్లా అధికారులు విచారణ జరిపి మరోసారి ఇలా జరక్కుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యక్తిగత సమాచారం పంచుకోకండి

బాలికలకు భద్రతాంశాలపై ఎస్పీ అవగాహన



విద్యార్థినికి డిక్షనరీ అందజేస్తున్న ఎస్పీ తుషార్ డూడి

పలమనేరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత కాలంలో వ్యక్తిగత సమాచారం పంచుకోవడం ప్రమాదకరమని గ్రహించాలంటూ విద్యార్థినులకు ఎస్పీ తుషార్ డూడీ సూచించారు. పలమనేరులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించిన ఆయన విద్యార్థినులకు భద్రతాపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. స్మార్టు ఫోన్, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని, తెలియని లింకులు క్లిక్ చేయవద్దని కోరారు.పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. ప్రతిభావంతులైన విద్యార్థినులకు పెన్నులు, కంపాక్సు బాక్సులు, డిక్షనరీలు ప్రభుత్వ ప్రధానోపాధ్యాయిని సుజాత సమక్షంలో అందజేశారు. అంతకుముందు ఆయన అర్బన్ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ముఖ్యమైన కేసులకు సంబంధించిన డైరీని, విలేజి రోస్టర్‌ను పరిశీలించారు. డ్రంకెన్‌డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు.పెండింగ్ కేసుల స్థితిగతులను సమీక్షించారు. పలమనేరు మార్వాడీ సంఘం నాయకులు ఎస్పీని సన్మానించారు. డీఎస్పీ ప్రభాకర్, సీఐ మురళీమోహన్, ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మరో 203 పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదన



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో మోహన్ కుమార్

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అదనంగా 203 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు డీఆర్వో మోహన్ కుమార్ తెలిపారు. శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో 1776 పోలింగ్ కేంద్రాలుండగా, వీటిలో 8 కేంద్రాలను కొత్త భవనాల్లోకి మార్పు చేశామన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 1500 మందికి మించి పోలింగ్ కేంద్రాలున్న చోట అదనంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.జిల్లాలో ప్రస్తుతం 15,74,277 మంది ఓటర్లుండగా, వారిలో 7,74,244 మంది పురుషులు , 7,99,961 మంది మహిళలు, 72 మంది థర్డ్ జెండర్ ఉన్నారన్నారు. ఆర్డీవోలు శ్రీనివాసులు, అనుపమ, భవాని, శ్రీనివాసరాజు, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, ఎలక్షన్ సూపరింటెండెంట్ రాజేంద్ర, టీడీపీ అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్, కాంగ్రెస్ నుంచి పరదేశి, బీజేపీ నుంచి అట్లూరి శ్రీనివాసులు, వైసీపీ నుంచి ఉదయ్‌కుమార్, ఆమ్ ఆద్మీపార్టీ నుంచి బాలసుబ్రమణ్యం, బీఎస్పీ నుంచి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన నాగాలమ్మ ఆలయాలు



సంతపేట నాగాలమ్మ ఆలయంలో పూజలు

చిత్తూరు సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి సందర్భంగా నాగాలమ్మ ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. దీపావళి పండుగ తర్వాత ఐదురోజులకు నాగుల చవితి చేసుకోవడం ఆనవాయితీ. అందులో భాగంగా శనివారం నగరంలోని పొన్నియమ్మన్ గుడి, సంతపేట, కొంగారెడ్డి పల్లె, మురుకంబట్టు, దొడ్డిపల్లె, గిరింపేట తదితర ప్రాంతాల్లోని నాగాలమ్మ ఆలయాలు, పుట్టలకు భక్తులు పోటెత్తారు. దీపాలు వెలిగించి, పుట్టల్లో పాలు పోసి, కోడి గుడ్లు నైవేద్యాలుగా సమర్పించి పూజలు చేశారు. మహిళలు ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డిప్యుటేషన్‌పై డైట్ బోధన పోస్టుల భర్తీ

వెదురుకుప్పం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో ఉన్న బోధన ఖాళీలను భర్తీ చేసేందుకు డిప్యుటేషన్ ప్రాతిపదికన నియమించడానికి పాఠశాల విద్యాశాఖ శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ జిల్లా పరిషత్, మునిపల్ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్‌లకు రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి త్రీ మెన్ కమిటీ ద్వారా డైట్‌లో నియమించడానికి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ కమిటీలో కలెక్టర్ అధ్యక్షులుగా, జిల్లా విద్యాశాఖాధికారి కన్వీనర్‌గా, డైట్ ప్రిన్సిపాల్ సభ్యులుగా ఉంటారు. దీనికి ఈ నెల 23 నుంచి 29వ తేది వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. ఇప్పటి నుంచి లీప్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు అండర్-19 క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

నగరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న కేవీకే మైదానంలో ఆదివారం ఉదయం అండర్-19 జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు గాను బాల, బాలికలకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు చిత్తూరు జిల్లా స్కూలు గేమ్స్ కార్యదర్శులు బాబు, శారద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ చదువుతూ 2009లోపు పుట్టిన వారు పాల్గొనడానికి అర్హులన్నారు. పోటీలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తామని, ఎంపికైన వారు శ్రీకాకుళంలో నవంబరు 1 నుంచి జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ ఉమామహేశ్వరరావు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని క్రైమ్ సీఐ ఉమామహేశ్వరరావు చెప్పారు. శనివారం ఎన్‌పీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకీ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేరగాళ్లు పోలీసు అధికారులుగా, ఐటీ అధికారులుగా లేదా ప్రభుత్వ అధికారులని చెప్పి డబ్బులివ్వాలని అడిగి రకరకాలుగా మోసం చేస్తున్నారన్నారు. క్యూ ఆర్ కోడ్ లేదా లింకులు పంపి వాటి ద్వారా డబ్బు వసూలు చేస్తారని, ముఖ్యంగా విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరికైనా ఇలాంటి డిజిటల్ అరెస్టు అంటూ ఫోన్ వస్తే వెంటనే 1930కి లేదా 112కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ మెయిల్స్ సందేశాల ద్వారా పంపిన లింకులను ఎవ్వరూ ఓపెన్ చేయకూడదని సూచించారు.

నేడు ఐఈఆర్‌పీలకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రశిక్షలోని సహిత విద్యా కేంద్రాల్లో పనిచేస్తున్న ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్లకు ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని డీఈవో వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వారికి ప్రభుత్వం రెగ్యులర్ పే-స్కేల్ నిర్ణయించనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలోని సహిత విద్యా కేంద్రాల్లో ఐఈఆర్‌పీలుగా పనిచేస్తున్న 129 మంది ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు తప్పక హాజరు కావాలన్నారు.

ఆలయాల సందర్శనకు ప్రత్యేక బస్సు

శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని 27వ తేదీన ఆలయాల సందర్శనకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ శ్రీకాళహస్తి డిపో మేనేజరు రేవతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం శ్రీకాళహస్తి బస్టాండు నుంచి బస్సు బయలుదేరి గుడిమల్లం, అప్పలాయగుంట, వకులమాత ఆలయం, ముక్కోటి, తలకోనకు వెళ్లి తిరిగి సాయంత్రం 5 గంటలకు శ్రీకాళహస్తికి చేరుతుందని తెలిపారు. రానుపోను టిక్కెట్టు ధర రూ.450గా నిర్ణయించామని వెల్లడించారు. ఆలయాలను దర్శించడమే కాకుండా దీపారాధన చేసుకునే వెసలుబాటు కల్పించినట్లు తెలిపారు. టిక్కెట్ బుకింగ్‌కు ఆన్‌లైన్ సౌకర్యం కూడా ఉందని పేర్కొన్నారు.


3న బార్సిలోనాకు మౌర్య

స్మార్ట్‌సిటీ ఎక్స్‌పో వరల్డ్ కాంగ్రె‌స్‌కు తిరుపతి కమిషనర్

తిరుపతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య వచ్చే నెల 3వ తేదీన స్పెయిన్‌కు వెళ్లనున్నారు. ఆ దేశంలోని బార్సిలోనా నగరంలో 4 నుంచి 6వ తేదీ వరకు జరిగే స్మార్ట్ సిటీ ఎక్స్‌పో వరల్డ్ కాంగ్రెస్-2025 సదస్సులో పాల్గొననున్నారు. ఏపీ నుంచి విశాఖ, తిరుపతి మున్సిపల్ కమిషనర్లకు ఈ అవకాశం దక్కింది. ఈ రెండు నగరాలూ కేంద్ర ప్రభుత్వ తొలి స్మార్ట్ సిటీస్ జాబితాలో ఉన్న సంగతి తెలిసిందే. వివిధ దేశాల స్మార్ట్ సిటీ ప్రాజెక్టులను అధ్యయనం చేసి వాటిలో ఏపీలో అమలు చేయదగ్గ విధానాలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నారు. అలాగే తిరుపతిలో అమలు చేస్తున్న స్మార్ట్ సిటీ ప్రాజెక్టు పద్ధతులను సదస్సు ముందుంచనున్నారు.

ఐఆర్‌సీటీసీ షిరిడీ, జ్యోతిర్లింగ యాత్ర

● 8రోజుల ప్యాకేజీ టూర్



కె.రవికుమార్

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత రైల్వేకు అనుబంధంగా ఉన్న ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో దక్షిణ భారత దేశం నుంచి ఉత్తర భారత దేశంలోని ఐదు పుణ్యక్షేత్రాలు దర్శించుకోవడానికి వీలుగా 8రోజుల ప్యాకేజీ టూర్‌ను ఏర్పాటు చేశామని ఐఆర్‌సీటీసీ సౌత్ జోన్ జనరల్ మేనేజరు కె.రవికుమార్ వెల్లడించారు. శనివారం రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ పర్యాటక ప్రత్యేక రైలు 9వ తేదీ తమిళనాడులోని తిరునల్వేలిలో బయలుదేరి మధురై, తిరుచ్చి, చెన్నైల మీదుగా రేణిగుంటకు మరుసటి రోజు ఉదయం చేరుకొంటుంది. అక్కడ నుంచి కడప, గుత్తి, గుంతకల్లు స్టేషన్ల మీదుగా పంచవటి, త్రయంబకేశ్వరం, షిర్డి సాయి మందిరం, శనిసింగనాపూర్, పండరీపూర్‌లోని శ్రీవిఠల్ రుక్మిణీ ఆలయం, మంత్రాలయంలో శ్రీగురు రాఘవేంద్రస్వామి ఆలయాలను దర్శించుకోవచ్చని ఆయన తెలిపారు. తిరిగి 16వ తేదీ ఉదయం రేణిగుంటకు చేరుకొంటుంది. అక్కడ నుంచి బయలుదేరి రాత్రికి తిరునల్వేలికి చేరుకొంటుందని ఆయన తెలిపారు. **ప్యాకేజీ వివరాలు:** ఒక్కొరికి ప్యాకేజ్ సెకండ్ స్లీపర్ రూ14,400, 3ఏసీ రూ26,000, 2ఏసీ రూ36,500లుగా నిర్ణయించామన్నారు. పర్యాటకులకు భద్రత, వసతి, రవాణా, తాగునీరు, ఉచిత భోజన వసతులు ఉంటాయన్నారు. వివరాలకు, 500-8287932063, 9363488323, 9003140682లకు సంప్రదించాలని కోరారు.

మూడు బోట్లు...24 గంటలు

అవిశ్రాంతంగా శ్రమించిన పోలీసులు, రెస్క్యూ టీంలు - గల్లంతైన బాలుర మృతదేహాలు లభ్యం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం వద్దనున్న స్వర్ణముఖి నదిలో శుక్రవారం గల్లంతైన నలుగురు విద్యార్థుల ఆచూకీ కోసం అధికారులు, పోలీసులు 24 గంటలు... మూడు బోట్లతో ముమ్మరంగా జరిపిన గాలింపు చర్యలు ఫలించాయి. వేదాంతపురం పంచాయతీ, రామదాసుకాలనీకి చెందిన మునస్వామి రెడ్డి కుమారుడు బాలు(16) మృతదేహం శుక్రవారం లభ్యం కాగా శనివారం మధ్యాహ్నానికి తేజు, ప్రకాష్ మృతదేహాలు లభించాయి. సాయంత్రానికి మునిచంద్ర(15) మృతదేహం దొరికింది. చంద్రగిరి ఎమ్మెల్యే నాని, ఎస్పీ సుబ్బరాయుడు, ఆర్డీవో రామ్మోహన్‌రావు, జిల్లా అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ ప్రసాద్, సీఐలు, ఎస్‌ఐలు, ఫైర్ సిబ్బంది దగ్గరుండి సహాయక చర్యలు ముమ్మరం చేశారు. శనివారం తెల్లవారుఝామున 5 గంటల నుంచి మూడు బోట్లు ద్వారా దాదాపు 12 గంటల పాటు నది మొత్తం గాలించారు.



బాలుర మృతదేహాల కోసం గాలిస్తున్న రెస్క్యూ టీం

మిన్నంటిన తల్లిదండ్రుల ఆర్తనాదాలు

తిరుపతి రూరల్, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. గ్రామానికి ఆనుకుని ఉన్న స్వర్ణముఖి నది వంకలో శుక్రవారం సాయంత్రం గల్లంతైన నలుగురు బాలురూ అసువులుబాయడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. బిడ్డల ఆచూకీ కోసం శుక్రవారం సాయంత్రం నుంచి ఎదురు చూసిన తల్లిదండ్రులకు చివరకు కడుపుకోత మిగిలింది. చేతికందే వయస్సు బిడ్డలు మృతదేహాలుగా బయటకు రావడంతో ఆర్తనాదాలు మిన్నంటాయి. 'కడుపుకోత మిగిల్చి వెళ్లారా నాయనా' అంటూ కింద పడి దొర్లుతూ రోదించారు. వీరి రోదన చూసిన గ్రామస్తులు కంటతడిపెట్టారు.

● ఎంతవెతికినా కనిపించవేమినాయనా..

చిన్న కుమారుడు బాలు మృతదేహం శుక్రవారమే లభించడంతో పుట్టెడు దుఖంతో ఉన్న మంజుల, మునస్వామిరెడ్డి దంపతులు శనివారం ఉదయం నదివద్దకు చేరుకుని బోరున విలపించారు. ఉదయం 10 గంటలు దాటుతున్న పెద్ద కుమారుడు తేజ ఆచూకీ దొరక్కపోవడంతో 'ఎంత వెతికినా కనించవేమినాయనా.. ఎంతమంది వెతుకుతున్నా కనిపించకుండా ఎక్కడున్నావు నాయనా' అంటూ తల్లి మంజుల బోర్లాపడి గుండెలవిసేలా రోదించారు. 'తమ్ముడు పుట్టిన రోజున ఇద్దరూ మాకు దూరమయ్యారా' అంటూ రోధించడం అందరినీ కంటతడి పెట్టించింది. 'మేము బతికేదెలా దేవుడా' అంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. వీరిని ఓదార్చడం అక్కడున్న వారెవరివల్ల కాలేదు. అప్పటికే అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని మునస్వామిరెడ్డిని ఓదార్చారు.

- బాలు, తేజ తల్లి మంజుల

● సొమ్మసిల్లిన మునిచంద్ర తల్లి ఎల్లమ్మ



సొమ్మసిల్లిన ఎల్లమ్మ, పక్కనే రోదిస్తున్న కుటుంబీకులు

నదిలో గల్లంతైన కుమారుడు మునిచంద్ర కోసం ఆ తల్లి గుండెలవిసేలా రోదించింది. శనివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలసి నదివద్దకు చేరుకుని కుమారుడి ఆచూకీ కోసం ఎదురు చూసి..చూసీ సొమ్మసిల్లింది. ఏడ్చి..ఏడ్చి కన్నీరు ఇంకిపోయింది. మునిచంద్ర నాయనమ్మ మనవడిని తలచుకుని ఎక్కిఎక్కి ఏడ్చింది. 'మాకెందుకు అన్యాయం చేశావు దేవుడా' అంటూ బోరున విలపించింది. సాయంత్రానికి మునిచంద్ర మృతదేహం నదిలో లభించింది. తండ్రి మునిశేఖర్ మౌనంగా కంటతడిపెట్టడం అందరినీ కలచివేసింది. వీరి చిన్న కుమారుడు కూడా ఈతకు వెళ్లిన ఏడుగురిలో ఒకరని, అదృష్ట వశాత్తు క్షేమంగా బయటపడ్డాడని గ్రామస్తులు అంటున్నారు.

ఇసుకదిబ్బే మృత్యు కుహరంగా..



మంచి ఇసుకను తోడేసి దిబ్బలుగా ఆరబెట్టారిలా..

నదిలో నిల్వ చేసిన ఇసుక దిబ్బపైనే గల్లంతైన బాలురు సరదాగా కేరింతలు కొడుతూ ఈతకు దిగారని తెలుస్తోంది. వీరు విప్పిన దుస్తులు, చెప్పులు కూడా దిబ్బపైనే కనిపించాయి. నీటి ప్రవాహం పెరగడంతో ఉధృతికి బాలురు గల్లంతయ్యారు. తిరుపతి రూరల్ మండల పరిధిలోని స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతంలో ఎన్నో సంవత్సరాలుగా ఇసుక మాఫియా అనధికారికంగా ఇసుకను తోడేస్తున్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు చేపట్టారు. దీంతో తొండవాడ నుంచి తనపల్లె వరకూ నదిపొడవునా పెద్దపెద్ద గోతులు ఏర్పడి ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ఇసుక అక్రమ రవాణా ఆగడంలేదు. నదిలోకి వివిధ మార్గాల్లో ప్రవేశించి ఇసుకను తోడేసి విక్రయాలు చేపడుతున్నారు. ఇసుకను తోడేయడం వల్లే ఈ ప్రాంతంలో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయని గ్రామస్తులు అంటున్నారు.

కళ్లెదుటే స్నేహితులు మునిగిపోయారు



మీడియాతో మాట్లాడుతున్న విష్ణువర్ధన్

నాతోపాటు ఏడుగురు స్నేహితులు ఈత కోసం వచ్చాం. ఇసుక దిబ్బపై ఆడుకుంటూ ఉండగా ప్రవాహ ఉధృతి పెరిగింది. స్నానం చేస్తున్న నలుగురు కొట్టుకుపోయారు. నాతో పాటు మరో యువకుడు నదిలోని దర్బను పట్టుకోవడంతో బయటపడ్డాం. కళ్లెదుటే స్నేహితులు మునిగిపోవడం బాధ కలిగించింది.

ఘటన బాధాకరం : ఎస్పీ



స్వర్ణముఖి వద్ద ఎస్పీతో ఎమ్మెల్యే నాని, ఏఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం స్వర్ణముఖి నదిలో జరిగిన ఘటన బాధాకరమని ఎస్పీ సుబ్బరాయుడు అన్నారు. నదులు, వాగులు, వంకల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మన ఊరు, మనకు తెలిసిన, తిరిగిన ప్రాంతం కదా అని అలసత్వం పనికి రాదన్నారు. ఇప్పటికే వాగులు, వంకల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. మృతుల కుటుంబాలకు పోలీసు శాఖ తరఫున సానుభూతి తెలిపారు.

ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

● ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్



మీడియాతో మాట్లాడుతున్న విద్యాసాగర్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేంత వరకు రాజీలేని పోరాటం చేస్తామని ఏపీ ఎన్‌జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ చెప్పారు. శనివారం చిత్తూరుకు విచ్చేసిన రాష్ట్ర నాయకులకు ఎన్‌జీవో భవనంలో ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు దాదాపు రూ.31వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు పెద్ద ఎత్తున ఆశలు పెట్టుకున్నారని, వారి ఆశలను నిరాశపర్చకూడదన్నారు. ఉద్యోగుల హెల్త్ కార్డు సమస్యలను 60 రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పారని, ఇంతవరకు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న 11వేల మంది ఉద్యోగులను ఓపీఎస్ పరిధిలోకి తీసుకొస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ హామీని నిలబెట్టుకోవాలన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలను వర్తింపచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు అమలు చేసి ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో మద్దతు పలికిన ఉద్యోగుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జిల్లా అధ్యక్షులు కేవీ రాఘవులు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎన్‌జీవో సంఘం 14 తాలూకాలు పునర్విభజన అయ్యాయని చెప్పారు. తిరుపతికి 5, అన్నమయ్య జిల్లాకు 3, మిగిలిన 6 చిత్తూరు జిల్లా పరిధిలో కొనసాగుతాయన్నారు. తాలూకాల స్థితిగతులు ఎలా ఉండాలి, భవిష్యత్తులో ఎలాంటి కార్యాచరణ చేపట్టాలనే అంశాలపై చర్చించామన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగదీశ్, శివప్రసాద్, ఉపాధ్యక్షులు వెంకట్, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రదీప్, మురళీ, సురేష్, మురుగేశ్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం డ్రైవర్ల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పన్నీర్‌శెల్వం, ఇతర నేతలతో కలిసి డ్రైవర్ల సమస్యలను రాష్ట్ర అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు. డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని వారికి హామీఇచ్చారు.

పాపవినాశనం డ్యాం గేట్లు ఎత్తివేత



తిరుమల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వర్షాలకు తిరుమలలోని పాపవినాశనం డ్యాం కూడా నిండిపోవడంతో శనివారం మధ్యాహ్నం గేట్లు ఎత్తివేశారు. గురువారానికే తిరుమలలోని ఐదు డ్యాములు 85 శాతానికి నిండిపోయాయి. గోగర్భం డ్యాం శుక్రవారం పూర్తిస్థాయిలో నిండిపోవడంతో ఓ గేటును ఎత్తివేసి నీటిని దిగువకు విడుదల చేశారు. శనివారం ఉదయానికి పాపవినాశనం డ్యాం కూడా నిండిన క్రమంలో మధ్యాహ్నం 12 గంటలకు గేట్లు తెరిచి నీటిని విడుదల చేశారు. మరో మూడు డ్యాములు కూడా దాదాపుగా నిండిపోయాయి.

మొంథా తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండండి

సెలవులు రద్దు ● సీఎండీ శివశంకర్



తిరుపతి(ఆటోనగర్),అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం వల్ల సదరన్ డిస్కం పరిధిలో ఉన్న తొమ్మిది జిల్లాల్లో విద్యుత్ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు అప్రమత్తంగా ఉండాలని ఆ సంస్థ సీఎండీ శివశంకర్ హెచ్చరికలు జారీ చేశారు. తిరుపతిలోని సదరన్ డిస్కం కార్యాలయం నుంచి శనివారం తొమ్మిది జిల్లాల ఎస్‌ఈలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాన్ తీరం దాటేవరకు క్షేత్ర స్థాయినుంచి ఉన్నత స్థాయివరకు సెలవులు రద్దు చేశామన్నారు. ప్రతి ఒక్కరు కంపెనీ పరిధిలోని సెక్షన్లలో జేఎల్‌ఎం, ఏఎల్‌ఎం, లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇంజనీర్లు, ఏఈలు, డీఈఈలు, ఈఈలు, ఎస్‌ఈలు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రధానంగా ఆది, సోమ, మంగళవారాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షం తీవ్రత ఆధారంగా ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్‌లకు సమా చారం ఇవ్వాలని ఆదేశించారు. ఉమ్మడి ఐదు జిల్లాలకు ఐదుగురు సీజీఎంలను పర్యవేక్షించ డానికి నియమించామన్నారు.

తిరుమల బాలాజీనగర్‌లో మంత్రి నాదెండ్ల

రేషన్ దుకాణం పరిశీలన, సమస్యలపై ఆరా



తిరుమలలో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

తిరుమల, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): తిరుమలలో స్థానికులు నివాసముండే బాలాజీ నగర్‌లో మంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీలు నిర్వహించారు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన ఆయన శనివారం శ్రీవారి దర్శనం అనంతరం సాయంత్రం జపాలి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం బాలాజీనగర్‌కు చేరుకుని సమస్యలపై కొందరు మహిళలతో మాట్లాడటంతో పాటు రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. తిరుమలలో గ్యాస్ గోడౌన్ లేదని, కొన్ని సందర్భాల్లో తామే గ్యాస్ తెచ్చుకోవాల్సి వస్తోందని మహిళలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనికి మంత్రి గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులపై ఫైర్ అయ్యారు. ఇకపై గ్యాస్ సరఫరా చేయాలని ఆదేశించారు. గ్యాస్ సబ్సిడీ మూడో విడతలో కొంత జాప్యం జరిగిన మాట వాస్తవమేనని, త్వరలోనే అందరికీ అందుతుందని హామీ ఇచ్చారు. కొందరికే బియ్యం ఇస్తున్నారంటూ మరికొందరు ఫిర్యాదు చేయడంతో సంబంధిత అధికారులపై మంత్రి ఆగ్రహించారు. కొత్త రైస్ కార్డులు తీసుకున్న వారందరు రాష్ట్రంలో ఎక్కడైనా బియ్యం తీసుకోవచ్చన్నారు. ఈ సందర్భంలో ఓ ఒంటరి మహిళ మంత్రితో మాట్లాడుతూ తనకు బియ్యం ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ వెంటనే ఆమెకు కార్డు జారీ చేసి బియ్యం ప్రతి నెలా ఇవ్వాలంటూ ఆదేశించారు. కాగా కొందరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై మంత్రికి ఫిర్యాదు చేశారు. ఎన్నికల తర్వాత 'తిరిగి చూడలేదు' అంటూ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకురాగా ఆయనతో మాట్లాడతానని మంత్రి బదులిచ్చారు.

దీపావళి బహుమతి పేరుతో రూ.18లక్షలు కాజేశారు

తడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకు టపాసులు, గిఫ్టులు ఇస్తామంటూ రూ.18లక్షలు కాజేసిన ఘటన తడ మండలంలో వెలుగు చూసింది. పోలీసుల వివరాల మేరకు.. సూళ్లూరుపేటకు చెందిన కిరణ్‌కుమార్, అరుణ్‌కుమార్ అన్నదమ్ములు. అరుణ్‌కుమార్ అపాచీలో పని చేస్తుండగా కిరణ్‌కుమార్ సూళ్లూరుపేటలో జిరాక్స్ షాపు నడుపుతున్నాడు. దీపావళి పండుగకు గిఫ్టులు, టపాసులు ఇస్తామని నమ్మబలికి అపాచీ పరిశ్రమలోని ఉద్యోగుల నుంచి సుమారు రూ.18 లక్షల వరకు వసూలు చేశారు. పండుగ సమయానికి ఇద్దరూ కనిపించకపోవడంతో మోస పోయామని గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు

టీడీపీలోకి 20 కుటుంబాలు



టీడీపీలో చేరిన కుటుంబాలతో ఎమ్మెల్సీ కంచర్ల, ప్రేమ్‌కుమార్ తదితరులు

కుప్పం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలో వైసీపీ నుంచి 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు రాజగోపాల్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఈ చేరికలు జరిగాయి. మిట్టపల్లెలోని 20 కుటుంబాలకు చెందిన సభ్యులు టీడీపీలో చేరారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, మండల టీడీపీ అధ్యక్షుడు రాజగోపాల్ పార్టీ కండువాలు కప్పి వారిని స్వాగతించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కులమతాలకు అతీతంగా జరుగుతున్న అభివృద్ధి వైపు అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వయసును లెక్కచేయకుండా నిరంతరం రాష్ట్రాభివృద్ధికి, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం శ్రమిస్తున్నారని చెప్పారు. త్వరలోనే పార్టీపరంగా గ్రామ పర్యటనలు ఉంటాయన్నారు. స్థానిక సామాజిక, వ్యక్తిగత సమస్యలను గుర్తించి ఈ పర్యటనలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన కుటుంబాల ప్రతినిధులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసి టీడీపీలో చేరామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రామచంద్ర, కనీస వేతనాల సంస్థ డైరెక్టర్ శరవణ, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణమూర్తి, డైరెక్టర్ అన్నాదురై, నాయకులు ఏవీ.రవి, బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జిలు లీలా వెంకటేశ్, హైదర్ వలీ, చలపతి, జేకే.సంతోశ్, బాలకృష్ణ, కనకరాజు, మహేంద్ర, శ్రీనివాసులు, మణి, రమేశ్, వళ్లియప్ప, వెడి, దామోదర్, సుబ్రహ్మణ్యం, రాధా కృష్ణమూర్తి, వెంకటాచలం గౌడు, చంద్ర, పంచాయతీ పార్టీ అధ్యక్షులు, బూత్, యూనిట్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

పట్టు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని పట్టు రైతుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు, కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జీ.మునిరాజు అన్నారు. కుప్పంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో శనివారం కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పట్టు రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన నాయకులు మాట్లాడుతూ అధికారిక లెక్కల ప్రకారం కుప్పం నియోజకవర్గంలో 6,690 ఎకరాలలో పట్టు సాగవుతుందన్నారు. ఈ సాగును 15 వేల ఎకరాలకు పెంచడం లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికలు రూపొందిస్తున్నారని చెప్పారు. పట్టు రైతులకు అవసరమైన సకల సదుపాయాలు, సబ్సిడీలు అందించి వారి సంక్షేమానికి ప్రభుత్వం బాధ్యత వహిస్తుందని హామీ ఇచ్చారు. అంతకుముందు పట్టు రైతులు పలువురు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పట్టుసాగు విషయంలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్లు, సెరికల్చర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'1న చలో హైదరాబాద్'ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కుప్పం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన అనాగరిక దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న దళితుల ఆత్మగౌరవ నిరసన ప్రదర్శన విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. కుప్పంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రదర్శన జరిగింది. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా దళితులందరూ నవంబరు 1న హైదరాబాదు తరలిరావాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ కుప్పం గౌరవాధ్యక్షుడు పాపన్న, ఎంఎస్పీ రామకుప్పం మండల ఇన్‌చార్జి గోవింద, కుప్పం మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు రాజేశ్, ఎంఎస్పీ అధ్యక్షుడు జయప్ప, రామకుప్పం ఎమ్మార్పీఎస్ యువసేన అధ్యక్షుడు పళని, నాయకులు రమేశ్, జీ.వెంకటేశ్, శంకర్ గణేశ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్సీ కంచర్ల పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రమాద ఘటన బాధితులను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, కుప్పం మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు జిమ్ దాము, సోము తదితరులు పరామర్శించారు. ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మృతుని కుటుంబానికి, గాయపడిన వారికి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాయకులు మాట్లాడుతూ మృతుడు శివయ్య కుటుంబానికి కడా తరఫున రూ.5 లక్షలు నష్టపరిహారం ఇస్తామని ప్రకటించారు. గాయపడిన వారికి ప్రభుత్వ ఖర్చులతో మెరుగైన చికిత్సను అందిస్తామని హామీ ఇచ్చారు.

ప్రశాంత జీవనానికి సహకరించండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ సోమశేఖర్

వి.కోట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా జీవించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని వి.కోట అర్బన్ సీఐ సోమశేఖర్ అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లో సీఐ పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. బడిఈడు పిల్లలు చదువుకోవాలని, పిల్లలను పనులకు పంపకూడదని తల్లిదండ్రులకు సూచనలు చేశారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై మురళీ, పలువురు పోలీసులు, నేతలు తుకారం, గణపతి, శ్రీనివాసులు, తంగరాజ్, భాస్కర్, విశ్వనాథ్, దాము, శివ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సేవా భావానికి ప్రతీక 'వైట్ కోట్'



పీఈఎస్‌లో ప్రమాణం చేస్తున్న వైద్య విద్యార్థులు

కుప్పం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వైద్యులు ధరించే వైట్ కోట్ సేవాభావం, పవిత్రత, బాధ్యత, కరుణ అనే భావాలకు ప్రతీక అని పీఈఎస్ వైద్య కళాశాల డీన్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్.ఆర్.కృష్ణారావు అన్నారు. పీఈఎస్ వైద్య కళాశాలలో శనివారం 2025-26 విద్యా సంవత్సరం ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థుల వైట్ కోట్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కాడవరిక్ ప్రమాణం చేశారు. మానవ శరీరాన్ని గౌరవం, కృతజ్ఞత, మర్యాదతో చూడాలని ఈ ప్రమాణం వారికి వివరిస్తుందని డీన్ చెప్పారు. కార్యక్రమంలో పీఈఎస్ మెడికల్ సూపరింటెండెంట్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్, విభాగాధిపతులు, బోధన సిబ్బంది, విద్యార్థుల సంక్షేమాధికారి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శాంతిపురం తహసీల్దార్‌గా ప్రకాష్‌బాబు



శాంతిపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండల తహసీల్దారుగా ప్రకాష్‌బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులు, ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు.

సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలి



రక్త పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న వెంకటరమణ

రామకుప్పం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలన్నదే సీఎం చంద్రబాబు ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్ తెలిపారు. శనివారం రామకుప్పం మండలం కెంపసముద్రం, ఎస్.గొల్లపల్లె గ్రామాల్లో ఉచిత రక్త పరిక్షా శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్త పరీక్షలతో ప్రజల ఆరోగ్య స్థితి గతులను గుర్తించి వైద్యం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఏఎంసీ మాజీ చైర్మన్ గంట్లప్ప గౌడు, మాజీ ఉప సర్పంచ్ గంట్లరెడ్డి, నేతలు వెంకటరెడ్డి, కోదండరెడ్డి, ఉమేష్, సలాంబాషా, ఆదిల్ పాల్గొన్నారు.

ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో బాలాజి

పెద్దపంజాణి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు మండలంలోని మండల, పంచాయతీ స్థాయి అధికారులందరూ అందుబాటులో అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో బాలాజీ సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే నాలుగు రోజులు తుఫాన్ ప్రభావంతో వర్షాలు అధికంగా ఉండటంతో గ్రామస్థాయిలో ప్రజలందరిని అప్రమత్తం చేయాలన్నారు. ముఖ్యంగా పిల్లలు చెరువులు, వాగులు, వంకల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు హనుమంతు, ఈవోఆర్డీ శారదాదేవి, ఏఎస్ఐ చంద్రబాబు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వీధి కుక్కల వీరంగం... ఒకరికి గాయాలు

సోమల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సోమల-ఇరికిపెంట మార్గంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద వీధికుక్కలు కలికిరికి చెందిన ద్విచక్రవాహనదారుడు ఖాసీం వెంటబడి గాయపరిచాయి. ఎడమ కాలుపై తీవ్ర గాయం చేయడంతో స్థానిక వైద్యశాలలో చికిత్సలు కల్పించారు.

ఎడతెరపి లేని వాన

- పలమనేరు, సదుం మండలాల్లో కుండపోత
- బాలాజి సహకార సూపర్‌బజార్‌లోకి నీరు
- స్తంభించిన జనజీవనం



బాలాజీ సహకార సూపర్‌బజార్ లోపల వర్షపు నీరు



సరుకుల గోడౌన్‌లో వర్షపు నీటిని తోడుతున్న మహిళా సిబ్బంది

పలమనేరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి దాదాపు గంటపాటు కుండపోత వర్షం కురిసింది. భారీగా వర్షం కురవడంతో పలమనేరులోని జాతీయరహదారి, ఆర్టీసీ బస్టాండు, బజారు వీధులు నిర్మానుష్యంగా మారాయి. శనివారం ఉదయం నుంచి ఎండ రావడంతో ప్రజలు ఊపిరి పీల్చుకొన్నారు. అయితే సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది.

బాలాజీ సూపర్ బజార్ జలమయం

పలమనేరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ఆర్టీసీ బస్టాండుతో పాటు బస్టాండు సమీపంలోని బాలాజీ సహకార సూపర్‌బజార్‌లో సైతం వర్షం నీరు చేరింది. సూపర్ బజార్ ముందువైపు మోకాలు లోతు నీరు నిలిచిపోయింది. అకాల వర్షంతో సూపర్ బజార్‌లోకి నీరు చేరడంతో పలు ర్యాకులు నీటిలో మునిగాయి. అలాగే సూపర్‌బజార్‌లోని సరుకులు శుభ్రపరచే గోడౌన్‌లోకి సైతం వర్షం నీరు వెళ్లడంతో వేలాది రూపాయలు విలువ చేసే సరుకులు తడిచి ముద్దయిపోయాయి. సూపర్ బజార్ ముందు వైపు ఉన్న రాజకాలువలు ఆక్రమణలకు గురికావడంతో ఒక్కసారిగా కురిసిన వర్షానికి నీరు చెరువుకు వెళ్లలేక నిలిచిపోయింది. రాజకాలువపై ఆక్రమణలు తొలగించాలని మున్సిపల్ అధికారులను కోరినా పట్టించుకోక పోవడంతో ఈ దుస్థితి నెలకొందని సూపర్‌బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజీ తెలిపారు.



సదుంలో కురుస్తున్న జోరు వర్షం

● సదుం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సదుం మండల పరిధిలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి వరకు ఎడతెరపి లేని కుండపోత వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో చిన్నపాటి చెరువులు, కుంటలునిండుకుండల్లా తొణికిసలాడుతున్నాయి. కొర్లకుంటవారిపల్లె, చిలకపాటివారిపల్లె సాగునీటి ప్రాజెక్టులు మొరవలు పోతున్నాయి. అలాగే సదుం నడిబొడ్డున సాగే గార్గేయ నది ప్రవాహం పెరిగింది. ఎడతెరపి లేని ముసురు వర్షాలతో జనజీవనం స్తంభించింది.

నేరెళ్ల చెరువుకు గండి

సదుం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సదుం మండలం బూరగమంద పంచాయతీ పచ్చార్లమాకుపల్లె నేరెళ్ల చెరువుకు గండి పడింది. గత రెండు రోజులుగా గండి పడి చెరువులో నీరు సమీపంలోని బూరగమంద పెద్దచెరువులో కలుస్తోంది. స్థానికులు వీఆర్వో బాబాజీకి సమాచారం అందించారు. కాగా సంబంధిత ఇరిగేషన్ అధికారులు ఎవరూ గండి పూడికకు చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువు కింద సుమారు 150 ఎకరాలు ఆయకట్టు... వరి పంట సాగులో ఉంది. ఇప్పటికే మొరవ పోతున్న బూరగమంద పెద్దచెరువుకు నేరెళ్ల చెరువు నీరు సాగితే ఆయకట్టు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లడంతోపాటు మొరవ పోయేందుకు సిద్ధంగా ఉన్న సదుం సీతమ్మ చెరువు తెగే ప్రమాదం పొంచి ఉంది. సంబంధిత ఇరిగేషన్ అధికారులు గండి నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గండి పడ్డ నేరెళ్ల చెరువు నుంచి పారుతున్న నీరు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

● డీసీహెచ్ఎస్ పద్మాంజలి



రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ పద్మాంజలి

సదుం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అందించాల్సిన సేవల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని డీసీహెచ్ఎస్ పద్మాంజలి సీహెచ్‌సీ సిబ్బందిని హెచ్చరించారు. సదుం సీహెచ్‌సీని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, ఆస్పత్రి నిర్వహణ రికార్డులు, రోజువారీ ఓపీ, ఇన్‌పేషంట్లకు అందుతున్న వైద్యం, మందుల నిల్వలను పరిశీలించారు. అలాగే పోస్టుమార్టం గది నిర్మాణ పురోగతిపై ఆరా తీశారు. స్థాయికి తగినంత మంది వైద్యులు లేరని పలువురు తెలిపారు. ఏఎన్ఎంలు రోగులపై దురుసుగా వ్యవహరిస్తున్నట్లు పలువురు రోగులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆమె సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు చేశారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన



రోగులకు సలహాలు అందిస్తున్న వైద్యులు

రామకుప్పం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల ఆస్పత్రిచే శనివారం రామకుప్పం సమీపంలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 35 మంది రోగులు కంటి పరీక్షలు చేసుకోగా 10 మందికి మెరుగైన వైద్యం అవసరమని గుర్తించి సిఫార్సు చేశారు. కార్యక్రమంలో వైద్యులు సల్మా బేగం, పురుషోత్తం, లీనా, ఆలయ నిర్వాహకులు సీతాపతి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 38 మంది ఎంపిక



కంటివైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పుంగనూరు రూరల్, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): పుంగనూరు విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 38 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. శనివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో ఏర్పాటు చేసిన కంటి వైద్యశిబిరంలో కంటి సమస్యలున్న రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సంఘ ప్రతినిధులు చెంగారెడ్డి, మునస్వామి మొదలియార్, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

బస్ షెల్టర్‌ను ఢీకొన్న కారు



అశోక్‌నగర్ కాలనీ వద్ద బస్సు షెల్టర్‌ను ఢీకొన్న కారు

కల్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు-పీలేరు జాతీయ రహదారి దిగువ పోకలవారి పల్లి పంచాయతీ అశోక్‌నగర్ కాలనీ బస్టాప్ వద్ద ఉన్న బస్ షెల్టర్‌ను శుక్రవారం రాత్రి కారు ఢీకొంది. అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలానికి చెందిన ఐదుగురు వ్యక్తులు కారులో తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై ఆలయానికి వెళ్లారు. దర్శనానంతరం శుక్రవారం రాత్రి తిరిగి వస్తుండగా అశోక్‌నగర్ కాలనీ బస్టాప్ వద్దకు రాగానే కారు టైర్ పేలడంతో అదుపుతప్పి బస్ షెల్టర్‌ను ఢీకొంది. దీంతో వీరబల్లి మండలం మిద్దివడ్డిపల్లికి చెందిన డ్రైవర్ హరినాథ్‌కు స్వల్పగాయాలు కాగా.. మిగిలిన వారు సురక్షితంగా బయటపడ్డారు. అయితే కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా బస్ షెల్టర్ కొంత భాగం దెబ్బతింది. కల్లూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎనిమిదిమంది జూదరుల అరెస్టు

సదుం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకువారిపల్లె పంచాయతీ బాపన చెరువు మొరవ వద్ద మామిడి తోటలో జూదం ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.72,250 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ షేక్ షావలి శనివారం తెలిపారు. జూదం స్థావరంపై స్టేషన్‌కు అందిన రహస్య సమాచారంతో తన సిబ్బందితో వెళ్లి దాడి చేసి జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి పీలేరు కోర్టులో హాజరపరిచినట్లు ఆయన తెలిపారు.

జీడిరేవుల వంక పరిశీలన



తెగిపోయిన జీడిరేవుల వంక కల్వర్టును పరిశీలిస్తున్న తహసీల్దారు మధుసూదన్

సోమల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం సోమల-నంజంపేట మార్గ మధ్యంలోని జీడిరేవుల వంకను శనివారం తహసీల్దార్ మధుసూదన్ పరిశీలించారు. గత వారం రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలతో నీటి ఉధృతికి జీడిదేవుల వంక కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో తహసీల్దార్ వంక కల్వర్టు కొట్టుకుపోయిన తీరును పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి



సోమలలో నాగాలమ్మ విగ్రహాలకు పూజలు చేస్తున్న మహిళలు



పుంగనూరులో నాగదేవత

సోమల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తొలి కార్తీకమాసంలో నాగుల చవితిని పురస్కరించుకొని మహిళలు భక్తి శ్రద్ధలతో నాగాలమ్మ విగ్రహాల చుట్టూ ప్రదక్షిణలు చేసి నాగుల పుట్టల వద్ద పూజలు చేపట్టారు. సోమల, కరకమంద, కందూరు, నంజంపేట సూరయ్యగారిపల్లె, డిడ్డివారిపల్లె, నెల్లిమంద, పెద్దఉప్పరపల్లె నాగదేవతల ఆలయంలో అర్చకులు అభిషేక పూజలు చేసి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. అలాగే చెన్నయ్యగారిపల్లె చెన్నకేశవ ఆలయంలో కార్తీక శనివారం సందర్భంగా ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేక పూజలు చేపట్టారు.

అక్కదేవతలకు అభిషేకాలు

సోమల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సోమల మండలం గట్టువారిపల్లెలో కొలువుదీరిన అక్కదేవతల ఆలయంలో శనివారం అభిషేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సవరంవారిపల్లె, గట్టువారిపల్లె, గాంధీనగర్, కమ్మపల్లె గ్రామ భక్తులు ఆలయం వద్దకు చేరుకొని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పుంగనూరులో నాగులచవితి

పుంగనూరు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు, పరిసర ప్రాంతాల్లో శనివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో నాగులచవితి జరుపుకున్నారు. స్థానిక కోనేరు వద్దగల నాగదేవతలు, నాగులరాళ్లకు



ఉదయాన్నే మహిళలు స్నానాలు చేసి చలిపిండితో తయారు చేసిన దీపాల్లో నువ్వుల నూనెతో దీపారాధన చేశారు. రావిచెట్టు, నాగలరాళ్లకు నూలుదారం చుట్టి సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. పలుచోట్ల పుట్టలకు పసుపు కుంకుమతో పూజలు చేసి పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు. కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ అర్చకులు నాగదేవతలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

శ్రీవారి పాదక్షేత్రంలో ప్రత్యేక పూజలు

సదుం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితిని పురస్కరించుకుని స్థానిక కొత్తపల్లెలో వెలసిన శ్రీవారి పాదక్షేత్రంలో శనివారం ప్రత్యేక



ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని విశేషంగా అలంకరించారు. అలాగే స్థానిక రచ్చబండ, గార్గేయ నది ఒడ్డున వెలసిన ఆంజనేయస్వామి గుడి ప్రాంతాల్లో నాగుల పుట్టలకు పూజలు చేశారు.

విద్యార్థులు కృత్రిమ మేధస్సును అందిపుచ్చుకోవాలి



ఏఐ అవగాహన సదస్సులో పాల్గొన్న పీవీకేఎన్ అధ్యాపక బృందం

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నేటి సాంకేతిక యుగంలో వస్తున్న నూతన మార్పులతో పాటు కృత్రిమ మేధస్సు(ఏఐ)ను అందిపుచ్చుకోవాలని సాంకేతిక నిపుణులు శ్రీధర్ సూచించారు. కృత్రిమ మేధస్సు అంశంపై 2025-26 బ్యాచ్ విద్యార్థులకు శనివారం పీవీకేఎన్ కళాశాలలో ప్రిన్సిపాల్ జీవనజ్యోతి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు (ఏఐ) ద్వారా అనేక విధాలుగా సాంకేతికను వినియోగించుకుని ఉన్నత స్థాయికి రాణించే వీలుందన్నారు. ఏఐపై పట్టు సాధించడం ద్వారా ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని వివరించారు. అధ్యాపకులు, విద్యార్థులు ఏఐపై అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

8 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి



సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పత్రాన్ని అందజేస్తున్న జడ్పీ చైర్మన్, సీఈవో

చిత్తూరు రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జడ్పీ పరిధిలో 8 మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆ పదోన్నతి పత్రాలను జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు కలిసి పదోన్నతి పొందిన వారికి అందజేశారు.

వాహనాలకు ఆయుధపూజ

చిత్తూరు అర్బన్ (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ వాహనాల షెడ్డులో శనివారం ఆయుధపూజ నిర్వహించారు. మేయర్ అముద, కమిషనర్ నరసింహప్రసాద్ ఎంహెచ్‌వో లోకేష్ చెత్త తరలించే వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డ్రైవర్లను సత్కరించి స్వీట్లను పంపిణీ చేశారు.

పోలీసుల పిల్లలకు వ్యాసరచన పోటీలు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శనివారం చిత్తూరు పోలీసు అతిథిగృహంలోని కాన్ఫరెన్స్ హాలులో పోలీసు అధికారులు, సిబ్బంది, వారి పిల్లలకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోలీసు పిల్లల కోసం మహిళలు, పిల్లలను లైంగిక దాడుల నుంచి రక్షించడంలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై, పోలీసు అధికారులకు, సిబ్బందికి ప్రస్తుత కాలంలో పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం అనే అంశంపై పోటీలు నిర్వహించారు. విజేతలైన వారికి త్వరలో ఎస్పీ తుషార్ డూడీ చేతుల మీదుగా నగదు బహుమతులను అందిస్తామని ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాషా తెలిపారు.

● **నగరి:** నగరి వీసీఎన్ జూనియర్ కళాశాలలో పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా లైంగిక వేధింపుల నుంచి మహిళలు, చిన్న పిల్లల రక్షణ అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహించారు. రెండో ఎంఈవో నమఃశివాయ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 19 మంది విద్యార్థులు పాల్గొన్నారని సీఐ విక్రమ్ తెలిపారు.

కల్వర్టు నిర్మించండి



కల్వర్టు లేకపోవడంతో నీటి ప్రవాహంలోనే కాలువ దాటుతున్న గ్రామస్తులు

బంగారుపాళ్యం, అక్టోబర్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని శేషాపురం గ్రామ సమీపంలో పంటపొలాలకు వెళ్ళే దారిలో కల్వర్టు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు శనివారం వాపోయారు. వారు మాట్లాడుతూ బలిజపల్లె వద్ద ఉన్న చీకలచెరువు నిండడంతో ఆ నీరు ఉధృతంగా ప్రవహిస్తోందని, బావులవద్ద ఇళ్లు నిర్మించుకున్న తాము గ్రామానికి చేరుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని, పిల్లలు బడికి వెళ్ళాలన్నా పెద్దలు వెళ్లి దాటిస్తున్నట్లు వారు చెప్పారు. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న పార్థసారథి నాయుడు

చిత్తూరు రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలో ఇటీవల వరద కారణంగా నదీ పరివాహక ప్రాంతమైన వీరభద్రాకాలనీ వాసులకు నగరానికి చెందిన మాజీ కౌన్సిలర్ పార్థసారథి నాయుడు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఇళ్లలోకి నీరు చేరి చలికి ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి రావడంతో దుప్పట్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. సుమారు 200 మందికి పైగా దుప్పట్లు పంపిణి చేశారు. నగరంలోని ఆలయాలు, వంతెనల కింద వున్న యాచకులకు కూడా ఆయన స్వయంగా వెళ్లి బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. వీరభద్రాకాలనీ వాసులు పార్థసారథినాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి బోరు పరిశీలన

విజయపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లకండ్రిగ గ్రామానికి తాగునీరు సరఫరా చేసే బోరు మోటారు నీటిలో మునిగిపోవడంతో.. తాగునీరు కలుషితమైందని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో శనివారం సంఘటనా స్థలాన్ని తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో రాజేంద్ర పరిశీలించారు. తాగునీటిని పరీక్షించి సురక్షితంగా ఉందని తెలిపారు.

తెగిన వంతెన రోడ్డు



కుశస్థలి నదిలో తెగిన వంతెన రోడ్డు

నగరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కుశస్థలి నదిలో మూడు రోజుల పాటు వేగంగా ప్రవాహం ఉండడంతో నగరి - కీళపట్టు మార్గంలో ఉన్న లోతట్టు వంతెన తెగింది. దీంతో రెండు వైపులకు రాకపోకలు ఆగిపోయాయి. గ్రామానికి వెళ్లాల్సిన వారు కిలోమీటరు దూరంలో ఉన్న హైలెవల్ వంతెనపై నుంచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

దుబాయ్‌లో చంద్రబాబును కలిసిన ఉదయ్‌కిరణ్‌రెడ్డి



గంగాధరనెల్లూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దుబాయ్ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబును గంగాధరనెల్లూరు పంచాయతీ మోతరంగనపల్లెకు చెందిన ఉదయ్‌కిరణ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఉదయ్‌కిరణ్‌రెడ్డి దుబాయ్‌లో కాడ్ ఎమిరేట్స్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ, గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఐటీడీపీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

నీట మునిగిన వరి పంట



నింద్ర, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గతనాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పంట నీటమునిగింది. మండలంలోని నింద్ర పంచాయతీ సమీయపురం లెక్కదాఖలో కొప్పేడు దళితవాడకు చెందిన పోత చిన్నప్పకు చెందిన వరి పంట నీట మునిగింది. అదే విధంగా కొంత మంది వరి పంట నీటమునగడంతో ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


విజయవాణి స్కూల్‌కు ఎడ్యు ఐకాన్ అవార్డు



అవార్డు తీసుకుంటున్న వెంకటాద్రి నాయుడు

శ్రీరంగరాజపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్ ఆర్ పురం మండలం 49.కొత్తపల్లిమిట్టలోని విజయవాణి పబ్లిక్ స్కూల్ తరపున ఎడ్యు ఐకాన్ అవార్డు అందుకున్నట్లు కరస్పాండెంట్ వెంకటాద్రి నాయుడు తెలిపారు. గ్రామీణ విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షలకు శిక్షణతో పాటు, ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్ది, వివిధ రంగాల్లో స్థిరపడేందుకు కృషి చేసినందుకు విశాఖ ఎంపీ భరత్, మల్ల బ్యూరో ఆఫ్ చైల్డ్ డెవలప్మెంట్ అధ్యక్షులు మల్లా రాము నాయుడు చేతుల మీదుగా అవార్డు తీసుకున్నట్లు తెలిపారు. ఈ అవార్డు పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు రజని, సిబ్బంది అభినందించారు.

కేశవ చౌదరికి జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న కేశవచౌదరి

పెనుమూరు, అక్టోబరు 25 (ఆంధ్ర జ్యోతి): పెనుమూరులోని వెంకటేశ్వర విద్యానికేతన్ కరెస్పాండెంట్ కేశవచౌదరికి జాతీయ స్థాయి నిస్సాఐకాన్ అవార్డు లభించింది.ప్రతీ ఏడాది స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్, నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్ అసోసియేషన్(నిస్సా) ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉత్తమ సేవలందిస్తున్న పాఠశాలలకు నిస్సాన్ అవార్డులు అందిస్తారు. ఈ ఏడాది అవార్డులను విశాఖపట్నంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ భరత్, నిస్సా అధ్యక్షులు కులభూషణ్‌శర్మ చేతుల మీదుగా కేశవచౌదరి అవార్డు అందుకున్నారు. మూడు దశాబ్దాలుగా వేలమంది విద్యార్థులకు సేవలందిస్తున్నందుకు గాను ఈ అరుదైన గుర్తింపు లభించిందని ఆయన తెలిపారు. పలువురు అభినందనలు తెలిపారు.

పక్కా గృహాలు మంజూరు చేసి బాధితులను ఆదుకోండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రవినాయుడు

నింద్ర, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు గృహాలు నేలమట్టం కావడంతో వాటి స్థానంలో పక్కా గృహాలు మంజూరు చేసి బాధితులను ఆదుకోవాలని రాష్ట్ర ఐడీసీ మాజీ డైరెక్టర్ రవినాయుడు అన్నారు. శనివారం చిత్తూరులో కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నింద్ర మండలం కైపాకం పంచాయతీ బీసీ కాలనీలో పక్కా గృహాలు నిర్మించి దాదాపు 35 సంవత్సరాలు కావస్తున్నదని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పై భాగం పెచ్చులూడి కూలుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే భానుప్రకాష్ ఆదేశాల మేరకు కలెక్టర్‌ని కలసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. పరిశీలించి న్యాయం చేస్తామని కలెక్టర్ చెప్పారన్నారు. బీసీ కాలనీలో సుమారు 11 గృహాలు దుస్థితిలో ఉన్నాయని ఆయన తెలిపారు.

ఘనంగా స్కంద షష్టి ఉత్సవాలు

నగరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి కరకంతేశ్వర స్వామి ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామి సన్నిధిలో శనివారం స్కందషష్టి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వళ్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవ విగ్రహాలకు, మూల విరాట్లకు తొలుత ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసి అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. ఏకాంబరకుప్పం సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు.

వాహనాల తనిఖీ

వెదురుకుప్పం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కొల్లాగుంట చెక్‌పోస్టు వద్ద శనివారం రాత్రి కార్వేటినగరం ట్రైనీ ఎస్ఐ రమేష్ వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు సరిగా లేని వాహనాలను గుర్తించి జరిమానా విధించారు.

పక్కా గృహాల పరిశీలన

నింద్ర, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కైపాకం పంచాయతీ బీసీ కాలనీలో వర్షానికికూలిన పక్కా గృహాలను శనివారం జిల్లా హౌసింగ్ పీడీ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. వర్షానికి కూలిన గృహాల బాధితులను పరామర్శించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు హౌసింగ్ ఏఈ శ్రీధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక మండల మీట్ వాయిదా

● సమాచారం అందకే రాలేదంటున్న సభ్యులు
● వారి వెంటే అధికారులు



సభ్యులు, అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

చిత్తూరు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. చిత్తూరు మండలంలో మొత్తం ఎనిమిది ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఇందులో ముగ్గురు వస్తే సమావేశాన్ని నిర్వహించవచ్చు. అయితే శనివారం నిర్వహించిన సమావేశానికి ఒక సభ్యుడు మాత్రమే హాజరయ్యారు. దీంతో అధికారులు సభను వాయిదా వేశారు. సభ్యులకు సమావేశంపై సరైన సమాచారం అందకపోవడంతోనే హాజరుకాలేకపోయారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతిపక్షంలో ఉన్న కారణంగానే అధికారులు తమను పట్టించుకోవడం లేదని, కనీస గౌరవం ఇవ్వడం లేదని కొంత మంది సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సభ్యులతో పాటు మండల స్థాయి అధికారులు కూడా సమావేశానికి డుమ్మా కొట్టారు. 11.30 గంటలకే సమావేశ మందిరం ఖాళీగా కనిపించింది. ఒకరిద్దరు తప్పా ఎవరూ కూడా సమావేశానికి హాజరుకాకపోవడంపై పలు విమర్శలకు తావిస్తోంది. సభ్యులకు, మండల అభివృద్ధి అధికారికి పొంతన కుదరకనే గతంలో జరిగిన సమావేశాలకు కూడా సభ్యులెవరూ హాజరుకావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ముంచుకొస్తున్న తాగునీటి ఎద్దడి

● చెరువుల్లో మునిగిపోయిన ఏడు బోర్లు



కల్వర్టు నీటిలో మరమ్మతులు చేస్తున్న గ్రామస్తులు

పెనుమూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి రానుంది. అధికారులు గ్రహించి ముందే ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది. లేదంటే ప్రజల గొంతు ఎండే అవకాశముంది. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో మొత్తం చెరువులు నిండిపోయాయి. పెనుమూరుకు నీరందించే రెండు బోర్లు ఏనుగుకొండయ్యపల్లి, పెద్ద చెరువుల్లో పూర్తిగా స్టాటర్‌లతో కలిపి మునిగిపోయాయి. గుత్తావాండ్లవూరు, మఠంపల్లి, దేవికాపురం గ్రామాలకు నీరందించే బోర్లు గంగుపల్లి చెరువులో మునిగిపోయాయి. చింతపెంట పంచాయతీలో బండకిందపల్లి, రాఘవరెడ్డిపల్లి గ్రామాలకు తాగునీరు అందించే బోర్లు చింతపెంట చెరువులో మునిగిపోయాయి. వీటితో ఎప్పుడు ఏ సమస్య వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. గుత్తావాండ్లఊరుకు నీరందే పైపులైన్ గంగుపల్లి కల్వర్టు వద్ద డ్యామేజ్ కావడంతో గ్రామస్తులు అతి కష్టం మీద మరమ్మతులు చేపట్టారు. కల్వర్టులో నీరు అధికంగా వస్తుండటంతో పైపులు ఎంత వరకు ఉంటాయోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

ఉపాధి పనుల వివరాలను

సర్పంచులకు తెలియజేయండి: ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మోహన్

ఐరాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 28 పంచాయతీల్లో ఎక్కడైనా ఉపాధి పనులు చేపట్టినప్పుడు స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలకు అధికారులు తప్పక తెలియజేయాలని ఎంపీపీ మోహన్ అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న కారణంగా గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పైపు లైన్లు లీకేజీలను ఎప్పటికప్పుడు సరిచేసి, తాగునీటి కొరత రాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏపీవో జ్యోతి మాట్లాడుతూ ఉపాధి పనుల గురించి ప్రజా ప్రతినిధులకు తప్పకుండా తెలియజేస్తామన్నారు. ఇన్‌చార్జి ఏవో సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ యూరియా కొరత లేకుండా చూస్తామన్నారు. ఎంఈవో రుష్యేంద్రబాబు మాట్లాడుతూ నాగమవాండ్లపల్లె, మిట్టూరు, గుట్టకిందపల్లె పాథమిక పాఠశాలల్లో పెచ్చులూడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వరప్రసాద్, వైస్ ఎంపీపీలు నిత్య, రోజా, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచాలి: ఏపీసీ



వెదురుకుప్పం మోడల్ పాఠశాలలో సూచనలిస్తున్న ఏపీసీ వెంకటరమణ

వెదురుకుప్పం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ వెంకటరమణ ఆదేశించారు. శనివారం వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. మోడల్ ప్రాథమిక పాఠశాలను, అంగన్వాడీని తనిఖీ చేశారు. ఐటీఐని పరిశీలించారు. మోడల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని గదులను ఉపయోగించుకుని తరగతులను నిర్వహించాలని హెచ్‌ఎం మురళీరెడ్డిని ఆదేశించారు. మోడల్ పాఠశాలకు అవసరమయ్యే తరగతి గదులను కేటాయించాలని జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులును ఆదేశించారు. డీవైఈవో మహేశ్వరరావు, ఎంఈవో దామోదరం పాల్గొన్నారు.

దారి సమస్య పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న మొగిలి గ్రామస్తులు

బంగారుపాళ్యం, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): దారి సమస్య పరిష్కరించాలని కోరుతూ మొగిలి గ్రామస్తులు శనివారం తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఆర్.సుబ్రమణ్యం, అతని కుటుంబ సభ్యులైన అమరావతమ్మ, మురళి, మునిప్రకాష్‌లు ఆక్రమించుకున్నారని, దారి విషయమై అడిగితే దూషిస్తున్నారని తెలిపారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం మొగిలీశ్వరుడి ఆలయానికి వెళ్ళడానికి కూడా ఇదే ప్రధాన రహదారని, దీన్ని ఆక్రమించుకోవడంతో భక్తులకు, గ్రామస్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తహశీల్దార్‌తో ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన తహశీల్దార్ మండల సర్వేయర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం గ్రామస్తులు ఎంపీడీవో మహేష్, ఈవోపీఆర్‌డీ పురుషోత్తంకు వినతి పత్రం అందజేశారు. మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి గోపి, తులసీరామ్ నాయుడు, శంకర్‌నాయుడు, నిర్మాల, రెడ్డెమ్మ, వళ్లేమ్మ, తులసమ్మ, ధరణమ్మ, సిద్ధమ్మ పాల్గొన్నారు.

వర్ష బాధితులకు వస్తు సామగ్రి పంపిణీ



యాదమరి, అక్టోబర్ 25(ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇబ్బందులు పడుతున్న యాదమర్రి మండలం మాదిరెడ్డిపల్లిలోని ఎం.వి.వై.కాలనీ (మహావీర యానాది కాలనీ)లోని గుడిసెల్లో నివసిస్తున్న ఐదు కుటుంబాలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చిత్తూరు జిల్లా శాఖ అండగా నిలిచింది. గుడిసెలు ఉరుస్తున్న కారణంగా నష్టపోయిన ఈ ఐదు కుటుంబాలకు రెడ్‌క్రాస్ జిల్లా శాఖ తరపున తక్షణ సహాయంగా 5 టార్పాలిన్‌లు, 5 కిచెన్ కిట్లు అందించారు. రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి ఆర్.సహదేవనాయుడు మాట్లాడుతూ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రత పాటించాలని కోరారు. జిల్లా రెడ్‌క్రాస్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యురాలు అరుణకుమారి, కోఆర్డినేటర్ చిరంజీవి పాల్గొన్నారు.

సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ వద్దు: ఏపీటీఎఫ్

యాదమరి, అక్టోబర్ 25(ఆంధ్రజ్యోతి): అనుభవజ్ఞులైన సర్వీస్ ఉపాధ్యాయులపై టెట్ నిబంధన విధించడం సరికాదని ఏపీటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు గిరిబాబు యాదవ్, మండల అధ్యక్షుడు రేగంటి దేవానంద్ డిమాండ్ చేశారు. శనివారం యాదమరిలో ఉపాధ్యాయులను కలిసిన వారు మాట్లాడుతూ సర్వీసు ఉపాధ్యాయులు టెట్‌ను వ్యతిరేకించినట్లు తెలిపారు. 20 - 30 ఏళ్లుగా బోధిస్తున్న ఉపాధ్యాయులపై టెట్ విధించడం వారి నైపుణ్యాలను కించపరచడమేనని అన్నారు. తెలంగాణ, తమిళనాడు తరహాలో సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. లేదంటే ఆందోళన బాట పడతామని, ఉపాధ్యాయులు పాఠాలు చెప్పాలా, నేర్చుకోవాలా? అని ప్రశ్నించారు. 2010 విద్యాహక్కు చట్టం ముందు నియమితులైన వారికి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తారా:రోజా

నగరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని వైసీపీ కార్యాలయంలో నగరి మండల, మున్సిపల్, వనవాళ్ళపేట మండలాలకు చెందిన వైసీపీ కార్యకర్తలతో మాజీ మంత్రి రోజా శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడం అన్యాయమని తెలిపారు. నగరిలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి పనులు శూన్యమన్నారు. తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎన్నో పనులు చేశానని, నేడు ఎమ్మెల్యే తన తండ్రి విగ్రహం పెట్టడం వలన చేసిన అభివృద్ధి పనులు ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నగరి మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, వైస్ చైర్మన్‌లు వెంకటరత్నం, బాలన్, ఎంపీపీ భార్గవి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ



శ్రీరాములును పరామర్శిస్తున్న టీడీపీ నేతలు

పెనుమూరు, అక్టోబరు 25 (ఆంధ్ర జ్యోతి): మండలంలో గుడ్యాణంపల్లిలో టీడీపీ కార్యకర్త శ్రీరాములు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. శనివారం ఆయన్ను యాదవసాధికార సమితి పార్లమెంటు అధ్యక్షులు శ్రీధర్‌యాదవ్ పరామర్శించారు. కటికపల్లి సర్పంచ్ వరదరాజులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రసాద్ ఉన్నారు.

ఎస్ఐ చిన్నరెడ్డెప్ప బదిలీ?

పాలసముద్ర, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పాలసముద్రం ఎస్ఐ చిన్నరెడ్డెప్పను చిత్తూరు దిశ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు తెలిసింది. నారాయణవనం ఎస్ఐ రాజశేఖర్‌ను పాలసముద్రం ఎస్ఐగా నియమించినట్లు సమాచారం. ఈనెల 18వ తేదీ నరసింహాపురం కూడలి ప్రాంతంలో జీడీనెల్లూరు నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి వ్యాఖ్యలపై టీడీపీ నాయకులు, మహిళలు నిరసన చేసి ఆమె దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ అత్యుత్సాహంతో టీడీపీ మహిళా నేతలను అరెస్టు చేశారు. దీంతో టీడీపీ నాయకులు ఎస్ఐతో వాగ్వాదానికి దిగి ఎమ్మెల్యే థామస్‌కు, నగరి డీఎస్పీకి, ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ వెనుతిరిగారు. కొన్ని నెలలుగా ఎస్ఐ వ్యవహారశైలిపై ఎమ్మెల్యే ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో ఎస్ఐని బదిలీ చేసినట్లు టీడీపీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

3నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

చిత్తూరు రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ నవంబరు 3వ తేది నుంచి నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెను కార్మికులందరూ జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. శనివారం నగరంలోని గాంధీ విగ్రహం నుంచి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు బైకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, మున్సిపల్ కార్మికులు సంఘ నాయకులు నాగరాజు, రఘు, బాలాజీ, వినాయక, వాసు, సుబ్రమణ్యం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న వరి పంటల పరిశీలన

పాలసముద్రం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అల్ప పీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వరిపంటను శనివారం వనదుర్గాపురం గ్రామంలో మాల కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్ జనసైనికులతో కలసి పరిశీలించారు. వర్షాలకు దెబ్బతిన్న పంటల గురించి గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, నష్టపరిహారం అందే విధంగా కృషి చేస్తారని రైతులకు తెలిపారు. జనసైనికులు లతీష్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

నీవా నది పరివాహక ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలి

చిత్తూరు అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నీవానది పరివాహక ప్రాంత ప్రజలు భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సాయినాథ్ సూచించారు. శనివారం నీవా నది పరివాహక ప్రాంతాల్లో రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్యతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ రాబోయే నాలుగు రోజులు తుఫాన్ ప్రభావంతో నీవానది పొంగిపొర్లి ఏ క్షణమైనా వర్షపునీరు ఇళ్లలోకి వచ్చే అవకాశం ఉన్నందున బాధిత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధిక తేమ కారణంగా మట్టిగోడలు పడిపోయే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ ప్రాణ రక్షణ కోసం ముందుగానే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు.

రోడ్డు బాగు చేయాలంటూ కలెక్టరుకు వినతి

వెదురుకుప్పం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం వేణుగోపాలపురం రోడ్డు నుంచి చెంచుగుడి రోడ్డు వరకు బాగు చేయాలని కలెక్టరు సుమిత్‌కుమార్‌కి టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు బీఎం రవి శనివారం వినతిపత్రమిచ్చారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, ఎమ్మెల్యే థామస్ ఆదేశాలతో వినతిపత్రమిచ్చామని ఆయన తెలిపారు.

వైభవంగా నాగుల చవితి వేడుకలు

నగరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నాగుల చవితిని పురస్కరించుకుని మహిళలు నాగదేవతకు పూజలు చేశారు. మాజీ మంత్రి రోజా పాత బస్టాండ్ సమీపంలో గల నాగదేవత విగ్రహం వద్ద పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ● శ్రీరంగరాజపురం: ఎస్ఆర్‌పురం మండలం, శెట్టివావత్తం పంచాయతీ సమీపంలోని నాగాలమ్మ ఆలయంలో మహిళలు పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి, మొక్కులు తీర్చుకున్నారు.